- భద్రాద్రి జిల్లాలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- కాంగ్రెస్ నాయకుల అండతో జోరుగా దందా
- అక్రమార్కులకు కలిసొస్తున్న అధికారుల ఉదాసీనత
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- ఇసుక రీచ్‌లకు, వాహనాలకు అనుమతులు నిల్
- సామాన్యుడికి భారంగా ఇసుక ధరలు

**భద్రాద్రి జిల్లాలోని గోదావరి నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో జోరుగా అక్రమ వ్యాపార దందా సాగుతున్నది. అధికారుల ఉదాసీనతతో ఇసుక లారీలు చెక్‌పోస్టులను దాటి హైదరాబాద్ సిటీ వరకు వెళ్తున్నాయి. జిల్లావ్యాప్తంగా చర్ల మండలంలో ఒకేఒక్క ఇసుక రీచ్‌కు అనుమతి ఉండడంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. జిల్లాలోని గోదావరిపై ఉన్న అన్ని ఇసుక రీచ్‌లు, ఇసుక వాహనాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడం అక్రమార్కులకు కలిసొచ్చింది. ఇసుక దందా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీ మొత్తంలో గండిపడుతున్నప్పటికీ ఉన్నతస్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం.**

**–భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)**

### క్వారీల్లేవు.. ఇసుక పుష్కలం

అసలు ఇసుక తవ్వకాలు చేసే క్వారీలే లేవు.. కానీ ఇసుక మాత్రం పుష్కలంగా దొరుకుతున్నది. అయితే సామాన్యులకు మాత్రం ధరలు అందుబాటులో లేకపోవడంతో ఇండ్ల నిర్మాణాలు చేసుకునేవారు చాలా ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ నాయకుల అండతో ఇసుక లారీలు హైదరాబాద్ సిటీ వరకు తరలిపోతున్నాయి. గత ఎనిమిది నెలల క్రితం ఆంధ్రా ఇసుక హైదరాబాద్ తరలిస్తుండగా.. మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. అదే తరహాలో ఇటీవల తాజాగా మరో ఆరు లారీలను ఓవర్ లోడ్ పేరుతో మైనింగ్ అధికారులు పట్టుకుని జరిమానా విధించారు. కానీ.. ఎవరి లారీలు, ఎవరి కోసం ఇసుక తరలిస్తున్నారు అనేది అధికారులు గుట్టువిప్పలేదు. కేవలం జరిమానా విధించడం తప్ప ఎవరి హస్తం ఉందో చెప్పకపోవడం కొసమెరుపు.

భద్రాచలం ఇసుక రీచ్



# గోదారిని తోడేస్తున్నారు!

కాంగ్రెస్ సర్కార్ ఇసుకకు అక్రమ రవాణాకు గేట్లు బార్లా తీసింది. భద్రాద్రి జిల్లాలో జరిగే ఇసుక దందాకు నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో చోటా, బడా నాయకులు పాత్రధారులుగా ఉండడంతో ఇసుక వ్యాపారం మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లుగా సాగుతున్నది. జిల్లావ్యాప్తంగా చర్ల మండలంలో ఒకటే ఇసుక రీచ్ ఉన్నప్పటికీ జిల్లా మొత్తానికి ఇసుక సరఫరా యథేచ్ఛగా సాగుతున్నది. దీంతో దొడ్డిదారి రవాణాకు అధికారుల అండదండలు కూడా పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఇసుక వాహనాలు కూడా లేవు..

మన ఊరు–మన ఇసుక వాహనాలు ఉంటే నిర్మాణదారులకు కొంత వెసులుబాటు ఉంటుంది. కానీ.. ప్రభుత్వం ఇసుక వాహనాలను కూడా అందుబాటులోకి తీసుకురావడం లేదు. కొరత సృష్టిస్తే అక్రమంగా రవాణా చేసుకొని డబ్బులు సంపాదించవచ్చని నాయకులే ఇసుక కొరతను సృష్టిస్తున్నారు. జిల్లాలో గతంలో మణుగూరులో 3, పినపాకలో 4, చర్ల 3, దుమ్ముగూడెంలో 2, భద్రాచలం 1, బూర్గంపాడులో 2 రీచ్‌లు ఉండేవి. కానీ.. ఇప్పుడు చర్లలో మాత్రమే ఒకటి అధికారికంగా నడుస్తున్నది. మరో సొసైటీకి అనుమతివచ్చినా ఇంకా ప్రారంభంకాలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా ఇసుక దందాకు అడ్డూ అదుపూ లేకుండాపోయింది. లక్ష్మీదేవిపల్లి మండలంలో ఇసుకదందా జోరుగా నడుస్తున్నది. సారపాక ప్రాంతమైతే అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అడ్డొస్తే ప్రభుత్వ సిబ్బందిని బెదిరిస్తున్న సందర్భాలున్నాయి. పోలీసులు సైతం అంటీముట్టనట్లుగా ఉండడంతో దందా మరింత విచ్చలవిడి అయ్యింది.

### దొరికితే దొంగ.. లేకుంటే దొర..

బ్రోకర్లు మధ్యవర్తులుగా ఉండి అధికార పార్టీ అండతో విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. దొరికితే దొంగ.. లేకుంటే దొర అన్నట్లు అన్ని చెక్‌పోస్టులకు మామూళ్లు ఇచ్చి దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తే దొరికితే జరిమానా కట్టడం.. లేకుంటే రూ.లక్షలకు విక్రయాలు చేయడం వారివంతు. ఇలాంటి ఘటనలు భద్రాద్రి జిల్లాలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా ఉండడంతో చెక్‌పోస్టులు దాటి హైదరాబాద్ సిటీకి వెళ్లిపోతున్నాయి.



బూర్గంపహాడ్ మండలం నుంచి గోదావరిలో ఇసుక తెస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

### ఇసుక వాహనాలు ఉండాలి



ఇసుకకు డిమాండ్ బాగా పెరుగుతున్నది. వాగులో ఇసుక కూడా ట్రాక్టర్ రూ.4 వేల చొప్పున అమ్ముతున్నారు. గోదావరి ఇసుక అయితే సామాన్యులు కొనలేని పరిస్థితి. సొసైటీలు పేరుకే.. పెత్తనమంతా బడా బాబులదే. అందుకే నాయకులు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు.

**–చారుగుండ్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉద్యోగి, పాల్వంచ**

### దొంగలకే అనుమతి ఇస్తున్నారు..



పేదవాడు ఇల్లు కట్టే పరిస్థితి లేదు. అర్ధరాత్రి తోలకానికి వేలల్లో డబ్బులు అడుగుతున్నారు. ఆ సమయంలో ఏ వాహనం అడ్డువచ్చినా ఢీకొట్టి వెళ్తున్నారు. ప్రమాదాలు బాగా జరుగుతున్నాయి. లోకల్‌లో వాగులు ఉన్నప్పటికీ అనుమతులు లేకపోవడంతో ఉపయోగం లేకుండాపోతున్నది.

**–కొండా రాజు, తాపీమేస్త్రీ, రుద్రంపూర్, కొత్తగూడెం**

### జిల్లాలో ఒక్కటే రీచ్..

జిల్లాలో ఒకే ఒకచోట ఇసుక రీచ్ చర్ల మండలం వీరాపురంలో ఉంది. ఇంకోదానికి అనుమతి వచ్చి ఉంది.. త్వరలో ప్రారంభమవుతుంది. మిగతాచోట్ల ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. ఆంధ్రాలో ఉన్న రీచ్‌ల ద్వారా ఇసుకను ఇక్కడకు రానివ్వడం లేదు. సొసైటీలకు అనుమతులు ఇస్తే అన్నిచోట్ల రీచ్‌లు పెట్టుకోవచ్చు. ఇసుక వాహనాలకు సైతం అనుమతులు ఉంటే ఇసుక కొరత ఉండదు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం.

**– దినేశ్, మైనింగ్ ఏడీ**

# మన్మోహన్ మృతి.. తీరనిలోటు

- భారత ఆర్థిక వ్యవస్థపై తనదైన ముద్ర
- మాజీ ప్రధాని సంతాప ప్రకటనలో 'నామా'

ఖమ్మం, డిసెంబర్ 27: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థపై తనదైన ముద్ర వేసిన నిబద్ధత గల నాయకుడు, విద్యావంతుడు, విధేయత కలిగిన మహోన్నతుడు అని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల శుక్రవారం ఒక ప్రకటనలో నామా సంతాపం వ్యక్తం చేశారు. 15వ లోక్‌సభలో తాను టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న సమయంలో పలు విషయాలపై మన్మోహన్‌సింగ్‌తో నేరుగా చర్చించినట్లు గుర్తుచేసుకున్నారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో లోక్‌సభలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు రాష్ట్ర ఏర్పాటుకు తాను తొలి ఓటు వేశానని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సంస్కరణల ద్వారా ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించడంలో ఆయన పాత్ర ఎనలేనిదని కీర్తించారు.



నాటి ప్రధాని మన్మోహన్‌తో అప్పటి ఎంపీ నామా (ఫైల్)

# మాజీ ప్రధాని సేవలు మరువలేనివి

**సంతాప సందేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, రేగా, మెచ్చా, చంద్రావతి**



దమ్మపేట/ సత్తుపల్లి టౌన్/ మణుగూరు టౌన్/ వైరా టౌన్, డిసెంబర్ 27: ప్రధానిగా దేశ ప్రజలకు డాక్టర్ మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు మరువలేనివని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు చంద్రావతి పేర్కొన్నారు. ఆయన మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, దేశం కూడా ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరుగా ప్రకటనల్లో తమ సంతాపాన్ని ప్రకటించారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ఏర్పడిందని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

# బజ్జీలు అమ్ముతూ నిరసన

**17వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె**



ఖమ్మం కలెక్టరేట్ వద్ద బజ్జీలు అమ్ముతూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 27: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మిరప బజ్జీలు చేసి అమ్ముతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తూ కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టంగా ఉందని, దానికంటే బజ్జీలు అమ్మి కుటుంబాలను పోషించుకుంటే బాగుంటుందని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు. అనంతర మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. సంఘం నాయకులు అనిల్, కృష్ణప్రసాద్, ఇస్మాయిల్, రాణి తదితరులు పాల్గొన్నారు.

# రివర్షన్‌తో సరి.. చర్యలేవి మరి?

- జిల్లాలో మారని విద్యాశాఖ తీరు
- 'ప్రత్యేక' ప్రమోషన్ వరకూ రావడానికి బాధ్యులెవరు?
- శాఖాపరమైన చర్యలు లేకపోవడంపై అనుమానాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 27: ప్రభుత్వ నిబంధనలకు వక్రభాష్యం చెబుతూ పనిచేస్తున్న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ప్రత్యేక ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో మరోసారి తన నైజాన్ని చాటుకుంది. 'ఎవరెన్ని చెప్పినా మా దారి మాదే..' అనే తీరుగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సదరు ప్రత్యేక ఉపాధ్యాయుల పదోన్నతుల విషయమై 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన వైనంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం అధికారులు.. తక్షణ చర్యలకు డీఈవోను ఆదేశించారు. దీనిపై డీఈవో స్పందిస్తూ వెంటనే ఆ ఫైల్‌ను పరిశీలిస్తామని, లోటుపాట్లు ఉంటే సంబంధితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానీ, శాఖాపరమైన చర్యలు లేవన్నది స్పష్టమవుతున్నది. ఈ అంశంపై ఖమ్మంతోపాటు పక్క జిల్లాలోని విద్యాశాఖ వర్గాల్లో, ఇతర సంబంధిత వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది.

### రివర్షన్‌తో సరిపోతుందా?

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ నుంచి బదిలీలు, పదోన్నతులు, నూతన నియామకాల వరకు అన్నింట్లోనూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు రూ.రెండున్నర కోట్లకు పైగా సమగ్ర శిక్ష నిధులు దారి మళ్లినా నేటి వరకు ఏ ఒక్కరిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా డీఎస్సీ–2024 నియామకాల విషయంలోనూ నిబంధనలు గాలికొదిలేసి ఏడుగురు అభ్యర్థులకు నియామకపు ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై వాస్తవాలు వెలుగులోకి రావడంతో రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం తక్షణ చర్యలు తీసుకోవాలంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాత్రికిరాత్రే ఏడుగురు అభ్యర్థులను ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తూ అర్ధరాత్రి ఉత్తర్వులిచ్చారు. అయినా ఈ తప్పిదాలకు కారణమైన వారిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. ఇక ప్రత్యేక ఉపాధ్యాయ పదోన్నతుల విషయాన్ని 'నమస్తే' వెలుగులోకి తేవడంతో ఉలిక్కిపడిన డీఈవో కార్యాలయం వెనువెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అర్హత లేకున్నా సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతులు పొందిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు వారికి మారుమూల ప్రాంతంలో రివర్షన్ పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. కానీ, దానికి భిన్నంగా వారిని బుజ్జగించి.. వారిపై ఎలాంటి చర్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చి వారు కోరిన ప్రాంతాలకు బదిలీ చేశారు. పదోన్నతుల విషయంలో తాము సక్రమంగానే వ్యవహరించామని, నలుగురు అభ్యర్థులు స్వచ్ఛందంగా వెనక్కి వెళ్లిపోతామని కోరినందున వారికి రివర్షన్ ఇచ్చామని, దీంతో ఎవరిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది.

### ఆ ఇద్దరిపై చర్యలెప్పుడో?

డీఈవో తెలిపిన ప్రకారం అనర్హులు ఎవరూ పదోన్నతులు పొందలేదని తెలుస్తోంది. కానీ, వాస్తవానికి పదోన్నతి పొందిన ఏడుగురిలో ఒక్క అభ్యర్థికి మాత్రమే సరైన ధ్రువపత్రాలు ఉన్నాయి. మిగతా వారిలో ముగ్గురికి కనీసం స్పెషల్ బీఈడీ గానీ, తత్సమాన విద్యార్హతలు గానీ లేవు. మిగతా ముగ్గురికి ఉద్యోగోన్నతి నాటికి ఆర్‌సీఐ జారీ చేసే సీఆర్ఆర్ లేదు. దీని ప్రకారం ఆరుగురిపై రివర్షన్ వేటు వేయాల్సి ఉండగా.. నలుగురిని కేవలం అభ్యర్థులు కోరారు అనే పేరుతో వెనక్కి పంపారు. దీంతో మిగతా ఇద్దరిని రక్షించేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. ఖమ్మం సమీపంలోని తనకు అస్మదీయుడైన ఒక మండల విద్యాధికారి తనకు బంధువైన అభ్యర్థికి రివర్షన్ ఇప్పించకుండా పావులు కదపడంతో తెలివిగా పక్కన పెట్టారు. అభ్యర్థుల ధ్రువపత్రాల ఫైల్ అంశాన్ని 'నమస్తే' వెలుగులోకి తెచ్చిన రోజే కూలంకషంగా పరిశీలించారు. ఆరోజే ఆరుగురిపై వేటు వేయాల్సి ఉండగా.. తమకు ఇబ్బంది రాకుండా ఉండడం కోసం రెండు రోజులు సమయం తీసుకుని ఒక వ్యూహం ప్రకారం నలుగురిపై మాత్రమే చర్యలు తీసుకున్నారు. ఈలోగా మిగతా అభ్యర్థులిద్దరూ అవసరమైతే కోర్టుకు వెళ్లి స్టేటస్ కో తెచ్చుకోవచ్చని, అప్పటివరకు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే ఏ శాఖలో అయినా అక్రమాలు వెలుగులోకి రాగానే వెంటనే సంబంధీకులపై చర్యలు తీసుకుంటారు. కానీ, జిల్లా విద్యాశాఖ మాత్రం ఇందుకు అతీతంగా ఉంది.




బోనకల్లులో నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

# ఆరు నెలలుగా వేతనాల్లేక..
# కుటుంబాలు గడవడం లేదు

- హామీలు అమలు చేసి మా సమస్యలు పరిష్కరించాలి
- టోకెన్ సమ్మెలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు

కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలుగా తమకు వేతనాలు అందించడం లేదని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పంచాయతీల పారిశుధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా తమ కుటుంబాలు గడవక పస్తులుండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీల పారిశుధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లు శుక్రవారం టోకెన్ సమ్మెకు దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలు, గ్రామాల్లో పనులు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనాలు చెల్లించాలని, అవికూడా ప్రతినెలా అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. **–నమస్తే నెట్‌వర్క్**



ఎర్రుపాలెంలో టోకెన్ సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

# 'ఇళ్ల సర్వే'ను పకడ్బందీగా నిర్వహించాలి

- దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి
- సర్వే పరిశీలనలో రాష్ట్ర హౌజింగ్ శాఖ ఎండీ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 27: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర హౌజింగ్ శాఖ ఎండీ వీపీ గౌతమ్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సిబ్బంది చేస్తున్న సర్వేను ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. మండల కేంద్రమైన జలగంనగర్‌లో సంబంధిత అధికారులతో కలిసి వెళ్లి సర్వే సిబ్బందితోనూ, దరఖాస్తుదారులతోనూ మాట్లాడారు. సర్వేకు వెళ్లే ముందు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుదారులు కూడా అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకొని ఉండాలని, సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లతో సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లు కూడా ప్రతిరోజూ తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితిగతులు తెలిసేలా ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. డాక్యుమెంట్ల ప్రకారం యాప్‌లో ప్రతీ విభాగాన్ని సమగ్రంగా పూరించాలన్నారు. సన్యాసయ్య, శ్రీనివాసరావు, రాంప్రసాద్, కుమార్, రాజారావు పాల్గొన్నారు.



ఖమ్మం రూరల్: సర్వేను పరిశీస్తున్న హౌజింగ్ శాఖ ఎండీ గౌతమ్

# తనిఖీలు ముమ్మరం చేయాలి


**ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ సందర్శనలో సీపీ సునీల్ దత్**



సీపీ సునీల్‌దత్‌కు బొకే ఇస్తున్న ఇన్‌స్పెక్టర్, గౌరవ వందనం చేస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం, డిసెంబర్ 27: జిల్లా, రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సీపీ సునీల్‌దత్ సూచించారు. వాహనాల తనిఖీలు కూడా ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన.. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులు తదితరాలను పరిశీలించారు. పిటీషన్ల విచారణల అంశాల గురించి సిబ్బందితో చర్చించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు వంటి వాటిని పరిశీలించారు. 'పెట్రోకార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏ విధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్తుల నివాసాలను కదలికలను ఏ విధంగా గుర్తిస్తున్నారు?' అడిగి పోలీసులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల బాధ్యతలు, రెగ్యులర్ రోల్‌కాల్ వంటి వాటిని విధిగా అమలు చేయాలని సూచించారు. ఎస్సై పీ.వెంకటేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- ఆన్‌లైన్ తరగతులకు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ
- సమ్మెలో కొనసాగుతున్న టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్



ఖమ్మం రూరల్ కేజీబీవీ వద్ద ఎంఈవో, పోలీసులు

# కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో..
# పోలీసుల పహారా

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 27 : సమగ్రశిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని గత 17రోజులుగా సమ్మె చేస్తున్నారు.. దీంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) పూర్తిస్థాయిలో బోధన ఆగిపోయింది. కాగా శుక్రవారం నుంచి నాన్‌టీచింగ్ సిబ్బంది అందరూ సైతం సమ్మెలో పాల్గొన్నారు. దీంతో విద్యార్థినులకు రాత్రివేళల్లో రక్షణ కరువైంది.. ఈ మేరకు పోలీసుశాఖ సహకారంతో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలోని 14 కేజీబీవీలు, 1 అర్బన్ డిప్రాయిడ్ స్కూళ్లలో విద్యార్థినుల రక్షణ కోసం పోలీసులు పహారా కాస్తున్నారు. శుక్రవారం ఆయా కేజీబీవీలను పోలీసు సిబ్బందితో కలిసి ఎంఈవోలు, తహసీల్దార్లు సందర్శించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలించలేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో శనివారం నుంచి అన్ని కేజీబీవీల్లో ఆన్‌లైన్ విధానంలో బోధన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం వెంటనే ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకురావాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈవోలను ఆదేశించారు.



తిరుమలాయపాలెం కేజీబీవీ వద్ద పోలీసులు, ఎంఈవో, తహసీల్దార్